

టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.2,500 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.37

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.37, కనిష్టంగా రూ.20 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
30.8°/22.3°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కతా తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 18 కి.మీ. వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- రొద్దం గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు ఆపేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతోనే పనులు ఆపినట్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచి పనులు జరగలేదు. దీంతో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించడంలోనూ జాప్యం జరుగుతోంది.

- బత్తలపల్లి మండలంలో గరిశలపల్లి, పోట్లమర్రి, అప్పరాచెరువు, దంపెట్ల, సంజీవపురం, ఓబుళాపురం పంచాయతీల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పనులు జరగడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా తొలగించారు. తాము చెప్పే వరకూ పనులకు వెళ్లరాదని టీడీపీ నేతలు చెబుతున్నారు.

- చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీలో ఉపాధి పనులు ఆగిపోయాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే మౌఖిక ఆదేశాలతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను పనికి రాకుండా చేశారు. కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను తెచ్చిన తర్వాత పనులు చేయాలని చెబుతున్నారు.

- కొత్తచెరువు మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులను తమ్ముళ్లు అడ్డుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా తొలగించారు. ఇంకా ఎవరినీ నియమించలేదు. దీంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి.

- అమరాపురం మండలంలో ఎన్నికల ఫలితాల అనంతరం పనులు జరగడం లేదు. అయితే గత పది రోజుల నుంచి అక్కడక్కడా అడపాదడపా పనులు చేపట్టారు. అరకొరగా కూలీలు వెళ్తున్నారు. డబ్బులు పడలేదని కూలీలు చెబుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- పనులను ఆపిన తెలుగు తమ్ముళ్లు
- ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చేందుకు కుట్ర
- స్వప్రయోజనాల కోసం అధికారులపై పెత్తనం
- పనులు లేక రోడ్డున పడుతున్న కూలీలు

సాక్షి, పుట్టపర్తి: స్వప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు ఉపాధి కూలీల పొట్ట కొడుతున్నారు. ఆ శాఖపై పెత్తనం చెలాయించి జేబులు నింపుకొనేందుకు వెంపర్లాడుతున్నారు. కొందరిని బెదిరించి రాజీనామాలు చేసేలా చేయగా... మరికొందరిని పనులకు వెళ్లకుండా అల్టిమేటం జారీ చేశారు. తమ వారినే ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకునేలా ప్రణాళిక రచించారు. దీంతో చాలా ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక పనులు జరగడం లేదు. దీంతో కూలీలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్యకర్తల మధ్య పోటాపోటీ..

టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ నేతలు అక్రమంగా ఆదాయం సంపాదించే వేటలో పడినట్లు స్పష్టం అవుతోంది. ఇప్పటికే దాదాపు అన్ని చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు మానేశారు. కొత్తవాళ్లను కొన్నిచోట్ల నియమించారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎవరన్న దానిపై స్పష్టత లేదు. పైగా కూటమిలోని మూడు పార్టీల నుంచి కార్యకర్తలు పోటీ పడుతున్నారు. ఏ పార్టీకి ఇవ్వాలి.. ఎవరికి ఇవ్వాలనే దానిపై జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు ఉపాధి పనులు లేక కూలీలు అల్లాడిపోతున్నారు. పూట గడవడమే కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలోనూ భారీ దందా..

గత 2014 – 19 మధ్యకాలంలో ఉపాధి హామీ పథకం టీడీపీ కార్యకర్తలకు మంచి ఆదాయ వనరుగా మారిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. చేసిన పనులకు సోషల్ ఆడిట్ తప్ప రికార్డులు చూపించాల్సిన అవసరం లేకపోవడంతో అడ్డగోలుగా దోచుకునేందుకు 'తమ్ముళ్లు' పోటీ పడుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో గ్రామ స్థాయి నుంచి అడ్డగోలుగా దోచుకున్నారు. దీంతో మరోసారి తమకు అనుకూలంగా ఉండే అధికారులను తెచ్చుకునేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. అప్పటి దాకా పనులు చేయకూడదని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా అనధికారిక ఆదేశాలతో చాలా గ్రామాల్లో పనులు రద్దు చేశారు.

కేసుల పేరుతో భయపెట్టి..

ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించే ఫీల్డ్ అసిస్టెంట్లు మానేసి వెళ్లిపోవాలని.. పనులు పర్యవేక్షించకూడదని.. స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు బెదిరించారు. కాదు.. కూడదు అంటే ఏదో కేసులో ఇరికిస్తామని హెచ్చరించారు. దీంతో దాదాపు అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు మానేశారు. ఆ తర్వాత కొన్ని చోట్ల కొత్తవాళ్లు వచ్చారు. కానీ పనులు సక్రమంగా చేయించడం లేదనే విమర్శలున్నాయి. గత 2014 – 19 కాలంలో యంత్రాలతో పని చేయించి.. బిల్లులు తీసుకుని కూలీల పొట్ట కొట్టిన తరహాలోనే మరోసారి దందా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. గడచిన ఐదేళ్లలో రోజుకు లక్ష మంది వరకు కూలి పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 30 వేలకు పడిపోవడం గమనార్హం.

జిల్లాలో ఉపాధి గణాంకాలు ఇలా..

జాబ్ కార్డుల సంఖ్య	2,59,895
ఉపాధి కూలీలు	4,76,217
ఫీల్డ్ అసిస్టెంట్లు	520
ఏడాది పని దినాల లక్ష్యం	75 లక్షలు
ఇప్పటి వరకూ పూర్తయిన దినాలు	45.70 లక్షలు
జమ అయిన కూలి	రూ.61.27 కోట్లు

పనులు ఆపాలని చెప్పలేదు



ఫీల్డ్ అసిస్టెంట్లు లేని కారణంగా ఉపాధి పనులు కొన్ని చోట్ల ఆగిన సంగతి నిజమే. కానీ పనులు ఆపాలని ఆదేశించలేదు. పనులు జరిగే చోట్ల వసతులు కూడా కల్పిస్తున్నాం. అంతేకాకుండా సకాలంలో బిల్లులు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాలు కురవడంతో వ్యవసాయ పనుల కారణంగా పొలాల్లో బిజీగా ఉంటూ ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య కొంతమేర తగ్గింది.

– కె.విజయప్రసాద్, పీడీ, డ్వామా

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సుకన్య రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం రామాంజినేయులు, పీఈటీ మహేష్ తెలిపారు. మంగళవారం అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. వచ్చే నెల 10 నుంచి 13వ తేదీ వరకూ గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సుకన్య పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని సుకన్యను ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్

ధర్మవరం రూరల్: మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని ఏలుకుంట్లలో రైతు వెంకటరమణ తోటలో ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, నేలకోట, బిల్వంపల్లి, తనకంటువారిపల్లి తదితర గ్రామాలకు చెందిన మామిడి రైతులకు ఎరువుల యాజమాన్యం, కొమ్మ కత్తిరింపులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యంలో భాగంగా సూపర్ పాస్పేట్ రెండు కేజీలు, పొటాష్ ఒకటిన్నర కేజీ, యూరియా అర కేజీ, కార్బోఫెరాన్ గులికలు, పశువుల ఎరువుతో కలిపి ప్రతి చెట్టుకూ వేయాలన్నారు. తర్వాత 15 రోజులకు జింక్ సల్ఫేట్ 250 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 250 గ్రాములు, బొరాక్స్ 250 గ్రాములు, కాపర్ సల్ఫేట్ 100 గ్రాములు కాండం నుంచి 5 అడుగుల దూరంలో గాడి తీసి వేయాలన్నారు. అదే విధంగా వేరుకుళ్లు తెగులుకు పాస్ఫో బాక్టీరియా 1 కేజీ, ట్రైకోడెరివిటి 1 కేజీ, ఎరువుతో కలిపి వాడడం వల్ల వేరుకుళ్లను నివారించుకోవచ్చన్నారు. అలాగే బంక నివారణకు 5 లీటర్ల నీటికి 1 కేజీ మైలు తిత్తు, 5 లీటర్ల నీటికి బట్టీ సున్నం కాండంకు పూయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి, వీహెచ్‌ఏలు గీతాంజలి, నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో 'స్పాట్' అడ్మిషన్లు



మడకశిరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మద్దిలేటి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొచ్చి ప్రవేశం పొందాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.5,800, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.5,050 రుసుం చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9866631405 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

10న జిల్లాస్థాయి చెస్ టోర్నీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి అర్బన్/పుట్టపర్తి టౌన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకొని జిల్లా స్థాయి టీచర్స్ చెస్ టోర్నీని ఆగస్టు 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి సుధాకర్ తెలిపారు. గురువారం పుట్టపర్తిలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ చేతుల మీదుగా ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 10న ధర్మవరం పట్టణంలోని కాకతీయ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రారంభమవుతుందన్నారు. టోర్నమెంట్‌కు కన్వీనర్లుగా రామకృష్ణనాయక్, శివకృష్ణ వ్యవహరిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే టోర్నీలో పాల్గొనేందుకు అర్హులన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు భూతన్న, ట్రెజరర్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు శివశంకర్, లక్ష్మీనారాయణ, తాహిర్‌వలి, నరేష్ కుమార్, బాబయ్య, మాలింగప్ప, కిష్టప్ప, రమేష్, ఫిరోజ్ ఖాన్, నాగేంద్ర పాల్గొన్నారు.

హీటర్ పట్టుకొని మహిళ మృతి



ముంతాజ్‌బేగం (ఫైల్)

ధర్మవరం అర్బన్: హీటర్ పట్టుకోవడంతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన ముంతాజ్‌బేగం (48) వేడి నీటి కోసం వాటర్ హీటర్‌ను ఆన్ చేసింది. అనంతరం నీళ్లు తీసుకునేందుకు బకెట్‌లో చేయి పెట్టగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలికి భర్త అస్లాంబాషా, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్ కల్లోలం



పుట్టపర్తి వద్ద సాగుకు సిద్ధం చేసిన భూమి

- ముఖం చాటేసిన వరుణుడు
- జిల్లాలో భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
- కరువైన ప్రభుత్వ సాయం
- ఆందోళనలో అన్నదాతలు

పుట్టపర్తి అర్బన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం తిరోగమనంలో పయనిస్తోంది. ప్రభుత్వం సాయం అందకపోవడంతో పాటు ప్రకృతి కూడా కరుణించకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. రెండు నెలల నుంచి ఆకాశం మేఘావృతం అవుతున్నా గాలి వేగానికి మేఘాలు చెదిరిపోతున్నాయి. రైతన్నలు వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నా వారికి నిరాశే మిగులుతోంది. కొందరు రైతులు అరకొర వర్షాలకే కాస్తో కూస్తో వేరుశనగ, కంది సాగు చేశారు. మరో వారం రోజుల్లో అదును దాటి పోతుందని వ్యవసాయాధికారులు చెబుతుండటంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఊరించి .. ఉసూరుమనిపించి..

నైరుతీ రుతు పవనాల ప్రభావంతో ఆరంభంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. దీంతో పంటల సాగు సాఫీగా సాగుతుందని రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే పొలాలను సిద్ధం చేసుకొని విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే ముందు ఊరించిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేయడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. గత నెల 21 నుంచి ఇప్పటి వరకూ పట్టుమని 10 మి.మీ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జూలై నెలలో 89.4 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకూ కేవలం 17.7 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో ఖరీఫ్‌పై రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

మరో పదిరోజులు గాలుల తీవ్రత..

గత 15 రోజుల నుంచి విపరీతమైన గాలులు వీస్తుండడంతో మేఘాలు చెల్లాచెదురవుతున్నాయి. విద్యుత్ సరఫరాకూ అంతరాయం కలుగుతోంది. విద్యుత్ సిబ్బంది రోజూ లైన్లు పరిశీలించడానికి సరిపోతోంది. విద్యుత్‌శాఖ సిబ్బందితో పాటు రైతులూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో 10 రోజులు ఇలాగే గాలుల తీవ్రత కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ సాయం కరువు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు భరోసా ద్వారా ఒక్కో రైతుకు రూ.7,500 అందజేస్తూ ఉచిత పంటల బీమాను పక్కాగా అమలు చేశారు. ఇక వివిధ పథకాల కింద నగదు జమ చేయడంతో రైతులు ఆనందంగా పంటల సాగు చేసుకునేవారు. ప్రస్తుతం రైతుల కోసం ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. నెలన్నరకే ప్రజలంతా గత ప్రభుత్వమే మేలని చెబుతున్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఐదేళ్ల పాటు కరువు దృశ్యాలను చూసిన రైతులు ఇక ఐదేళ్లు కూడా ఇంతేనా అంటూ నిట్టూరుస్తున్నారు. ఇక కాస్తో కూస్తో సాగైన పంటలను నమోదు చేసే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టలేదు. ప్రకృతి వైపరీత్యాలు వస్తే ఏ సహాయమూ చేయరా? అంటూ రైతులు వాపోతున్నారు.

99,969 హెక్టార్లలో సాగు..

జిల్లా వ్యాప్తంగా 2,89,601 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే కేవలం 99,969 హెక్టార్లలోనే పంటలు సాగు చేశారు. వేరుశనగ పంటను 65,004 హెక్టార్లలో సాగు చేయగా 15,055 హెక్టార్లలో కంది, 6,985 హెక్టార్లలో మొక్కజొన్న పంటలను సాగు చేశారు. వరి 664 హెక్టార్లు, జొన్న 154 హెక్టార్లు, రాగి 901 హెక్టార్లు, కొర్ర 39 హెక్టార్లు, సజ్జ 366 హెక్టార్లు, ఆముదము 1557 హెక్టార్లు, పత్తి 1821 హెక్టార్లు, పొద్దు తిరుగుడు 6 హెక్టార్లు, ఉలవలు 78 హెక్టార్లు, పెసలు 19 హెక్టార్లలో సాగు చేయగా ఇతర పంటలను 6,961 హెక్టార్లలో సాగు చేశారు.

పంటల సాగు కష్టంగా ఉంది



నాకున్న నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేయడానికి వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేశాను. సుమారు 45 రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని అనుకుంటున్నాను. ఇకపై వేరుశనగ సాగు చేసినా ఫలితం ఉండదు. దిగుబడి రాదు. వర్షాలు కురిసే కార్తెలు వెళ్లి పోవడంతో రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి. ఖరీఫ్‌లో పంటల సాగు కష్టంగానే ఉంది.

– నాగరాజు, చెర్లోపల్లి, పుట్టపర్తి మండలం

ఆగస్టు 15 వరకూ అవకాశం



రాబోవు రోజుల్లో వర్షాలు కురుస్తాయనే ఆశాభావం ఉంది. ఆగస్టు 15 వరకూ పంటలు సాగు చేయవచ్చు. అనంతరం ప్రత్యామ్నాయ పంటలు సాగు ఆలోచన చేయవచ్చు. ఇప్పటి వరకూ సుమారు లక్ష హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలకు సైతం ఈ వర్షాలు సరిపోవడం లేదు. జూలై నెలలో వర్షాలు అనుకున్నంత కురవలేదు.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రికార్డులు పటిష్టంగా భద్రపరచండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమైన జేసీ అభిషేక్‌కుమార్

ధర్మవరం రూరల్/తాడిమర్రి/బత్తలపల్లి: రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రతి రికార్డును పటిష్టంగా భద్రపరచాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం, బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం, తాడిమర్రి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. రికార్డు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. రికార్డుల నిర్వహణ, వాటి భద్రత విషయంలో రెవెన్యూ అధికారులపైనే బాధ్యత ఉంటుందన్నారు. తహసీల్దార్ అనుమతి లేనిదే వీఆర్‌ఓలు కూడా రికార్డుల గదిలోకి వెళ్ల కూడదన్నారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే రైతులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాలయాపన చేయకుండా అంకిత భావంతో పనులు చేస్తూ అందరికీ న్యాయం చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



కదిరిలో పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

కదిరి టౌన్: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ వీ.రత్న సిబ్బందిని ఆదేశించారు. కదిరి టౌన్, అప్ గ్రేడ్, కదిరి రూరల్ పోలీస్‌స్టేషన్లలను ఎస్పీ గురువారం తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని లాకప్, ఉమెన్ హెల్ప్‌డెస్క్, రికార్డుల నిర్వహణ, లాకప్ గదులు పోలీస్‌స్టేషన్ పరిసరాలను ఆమె పరిశీలించారు. కదిరి టౌన్ సర్కిల్ పరిధిలోని శాంతి భద్రతలపై చర్చించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించి కేసులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్కా, పేకాట, గంజాయి, నాటుసారా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. డీఎస్పీ శ్రీలత, సీఐలు కె.పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, ఎస్‌ఐలు బాబ్జాన్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రత్న పరిశీలించారు. కదిరి నుంచి పుట్టపర్తికి వెళ్తున్న ఎస్పీ మార్గమధ్యంలో నల్లమాడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది సంఖ్య, కేసుల వివరాలపై ఆరా తీశారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ రమేష్ బాబు పలు సూచనలు చేశారు.



తుంగభద్ర పరవళ్లు

తుంగభద్ర జలాశయానికి గురువారం కూడా వరద నీరు పోటెత్తాయి. దీంతో జలాశయం 20 క్రస్ట్ గేట్లను ఒక్కటిన్నర అడుగు మేర అధికారులు ఎత్తివేశారు. 44,812 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 7,865 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 97,272 క్యూసెక్కులుగా నమోదవుతుండగా, కాలువలకు వదిలే నీటితో కలిపి అవుట్‌ఫ్లో 49,384 క్యూసెక్కులుగా ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం హెచ్చెల్సీలో ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – బొమ్మనహళ్:

క్లుప్తంగా

యువకుడి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్: స్థానిక పాండురంగ నగర్ సమీపంలోని పూలేకమ్మ గుడి వెనుక గురువారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో ఫొటోలు తీసి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. దీంతో మృతుడు పెనుకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన నరసింహమూర్తి (21)గా వెల్లడైంది. విచారణలో నరసింహమూర్తికి ఇంకా పెళ్లి కాలేదని, రోజూ సెల్యూషన్ పీలుస్తూ మత్తులో ఉండేవాడని నిర్ధారణ అయింది. కాగా, ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనంతవాసులకు అత్యున్నత పురస్కారాలు



భరత్



జీవన్‌కుమార్

అనంతపురం కల్చరల్: ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందజేసే డిజిటల్ ఇండియా, మై గవర్నమెంట్ సాథీ పురస్కారాలకు జిల్లాకు చెందిన సామాజిక సేవా కార్యకర్తలు బిసాతి భరత్, జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఇద్దరూ గతంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో పని చేస్తూ మరోసారి పురస్కారాలకు ఎంపికైన వారు శుక్రవారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందుకోనున్నారు. ఈ సందర్భంగా భరత్, జీవన్‌కుమార్‌ను నెహ్రూ యువకేంద్రం అధికారులు మణికంఠ, శ్రీనివాసులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ రమేష్ అభినందించారు.

తుది దశకు ఎన్‌హెచ్ 544ఈ

- మంగళూరు పోర్టు నుంచి నేరుగా అమరావతికి అనుసంధానం
- రూ.502 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి నిర్మాణం
- రహదారి నిర్మాణంతో వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం



రొళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా

రొళ్ల: జాతీయ రహదారి 544ఈ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రోడ్డు రవాణా, రహదారుల కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్ణాటకలోని శిరా తాలూకా నుంచి జిల్లాలోని అగళి, రొళ్ల, మడకశిర, హిందూపురం, కొడికొండ చెక్‌పోస్టు వరకూ రూ.502 కోట్లతో దాదాపు 99 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. కొడికొండ చెక్‌పోస్టు నుంచి కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన అగళి మండలం పి.బ్యాడిగెర వరకూ 550 ఎకరాల భూమిని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల నుంచి సేకరించి, నిర్వాసితులకు రూ.92 కోట్ల మేర పరిహారాన్నీ అందజేసింది. జాతీయ రహదారి 544ఈ నిర్మాణంలో భాగంగా చిలమత్తూరు, దేమకేతపల్లి, హిందూపురం, పరిగి, మడకశిర, నీలకంఠాపురం, రొళ్ల, అగళి, హెచ్‌డీ హళ్లి వద్ద బైపాస్ పనులు పూర్తయ్యాయి.

మంగళూరు పోర్టు నుంచి కృష్ణపట్నం పోర్టు వరకూ..

ప్రస్తుతం 544ఈ జాతీయ రహదారి పనులు పూర్తయితే కర్ణాటకలోని మంగళూరు పోర్టు నుంచి బంట్వాళ, బెల్తంగడి, ఉజిరే, చార్మాడిఘాట్, కొటిగేహర, బేలూరు, హళేబీడు, బాణావర, హుళియారు మీదుగా జాతీయ రహదారి 73ని కలుపుతూ ఉప్పినంగడి, సకలేసపుర, హాసన, సెట్టిగెరె, తిపటూరు, చిక్కనాయకనహళ్లి మీదుగా శిరా పట్టణం వరకూ 150ఎ జాతీయ రహదారి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఇక్కడి నుంచి అగళి, రొళ్ల, మడకశిర, హిందూపురం, కొడికొండ చెక్‌పోస్టు వరకూ 544ఈ జాతీయ రహదారితో అనుసంధానించారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి 44వ జాతీయ రహదారి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానిస్తున్నారు. మొత్తం రూ.17 వేల కోట్ల వ్యయంతో 332 కిలోమీటర్ల మేర గోరంట్ల, పుట్టపర్తి, ముదిగుబ్బ, డోర్నకల్లు మీదుగా పులివెందుల, అనివేల, మైదుకూరు, మల్లేపల్లి, కనిగిరి, చీమకుర్తి, మేదరమెట్ల–మార్టూర్‌కు మధ్య చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి 16తో కలుపనున్నారు. మొత్తం నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి చిలకలూరిపేట, గుంటూరు మీదుగా అమరావతి, విజయవాడకు నేరుగా అనుసంధానించడం ద్వారా దాదాపు 150 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. దీంతో విజయవాడ నుంచి నేరుగా రాజమండ్రి, విజయనగరం, నెల్లూరు నగరాలతో పాటు కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం పోర్టు వరకూ రాకపోకలు సుగమమం కానున్నాయి.

150 కిలోమీటర్ల మేర తగ్గిన దూరం..

ప్రస్తుతం మంగళూరు పోర్టు నుంచి బెంగళూరుకు చేరుకుని అక్కడి నుంచి 75వ జాతీయ రహదారి మీదుగా గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ వరకూ మొత్తం 150కు పైగా కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఎన్‌హెచ్ 544ఈ పనులు పూర్తయితే 150 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ప్రయాణ దూరం తగ్గడంతో పాటు భారీ పరిశ్రమలు వచ్చే అవకాశంతో పాటు వాణిజ్య వ్యవహారాలూ పెరిగే అవకాశం ఉన్నాయి. తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశాలున్నాయి. దీంతో 544ఈ జాతీయ రహదారిపై ఉన్న పట్టణాలు, గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న భూముల విలువ బాగా పెరిగింది.

త్వరలో పనులు పూర్తి

కొడికొండ చెక్‌పోస్టు నుంచి కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన పి.బ్యాడిగెర వరకూ మొత్తం 99 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులకు రూ.502 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే 98 శాతం పనులు పూర్తయ్యాయి. మొత్తం 9 ప్రాంతాల్లో బైపాస్ ఏర్పాటుకు రైతుల నుంచి 550 ఎకరాలల భూమిని సేకరించాం. ఇందుకు సంబంధించి నిర్వాసిత రైతులకు రూ.92 కోట్ల పరిహారాన్ని కూడా చెల్లించాం. ప్రతి 50 కిలోమీటర్లకు ఓ టోల్‌ప్లాజా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలో పనులు పూర్తి చేసి జాతికి అంకితమివ్వనున్నాం. – ధనలక్ష్మి, ఏఈఈ, జాతీయ రహదారుల విభాగం

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పావగడ: స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న పాత ఆస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి (50) మృత దేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అన్నపానీయాలు లేక అనారోగ్యానికి గురై మృతి చెందినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పావగడ పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన భోజనం వడ్డించండి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

కదిరి అర్బన్: స్థానిక మున్సిపల్ ఉర్దూ మెయిన్ స్కూల్‌ను గురువారం డీఈఓ మీనాక్షి తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఏజెన్సీ నిర్వాహకులు ఇంటి వద్ద భోజనం వండి తీసుకురాకుండా పాఠశాలలోనే వండి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. పాఠశాలకు హెచ్‌ఎం లేకపోవడంతో కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం వరప్రసాద్‌రాజును ఇన్‌చార్జ్‌గా నియమించారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి చెన్నకృష్ణ ఉన్నారు.

ఆ యుద్ధం మరువలేను

- కార్గిల్ యుద్ధ వీరుడు నంజిరెడ్డి



నంజిరెడ్డి

మడకశిర: కార్గిల్ యుద్ధం నేటికీ తాను మరువలేకపోతున్నానని మడకశిర మండలం పాపసానిపల్లికి చెందిన మాజీ సైనికుడు, కెప్టెన్ నంజిరెడ్డి అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి పాతికేళ్లు అయిన సందర్భంగా గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. 1999, మే 3న ప్రారంభమైన యుద్ధం అదే ఏడాది జూలై 26 వరకూ కొనసాగిందన్నారు. ఈ యుద్ధంలో తనతో పాటు 30 వేల మంది సైనికులు పాల్గొన్నారని, ఇందులో 527 మంది వీర మరణం పొందారన్నారు. మరో 1,300 మంది సైనికులు వికలాంగులయ్యారన్నారు. పాకిస్తాన్ సైనికులు కూడా 1,400 మంది ఈ యుద్ధంలో మృతి చెందినట్లు తెలిపారు. శత్రుమూకలను దేశ సరిహద్దు నుంచి తరిమి వేయడంలో భారత సైనికులు చూపిన తెగువను కొనియాడారు.

టీడీపీ నేతల దౌర్జన్యాలు అరికట్టండి

- అదనపు ఎస్పీ విష్ణుకు చిలమత్తూరు ఎంపీపీ వినతి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

పుట్టపర్తి టౌన్: చిలమత్తూరు మండలంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు పెరిగిపోయాయని, చివరకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆ మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) పురుషోత్తం రెడ్డి మండిపడ్డారు. మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగేందుకు భద్రత కల్పించాలంటూ ఎస్పీ రత్నకు విన్నవించేందుకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. అయితే ఆమె అందుబాటులో లేకపోవడంతో అదనపు ఎస్పీ విష్ణును కలసి కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న చిలమత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకే ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న టీడీపీ నాయకులు నాగరాజు యాదవ్, గాజుల నాగరాజు, కొండప్ప, బాబురెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎంపీటీసీలను అడుకుని, దౌర్జన్యం చేశారన్నారు. దీంతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదన్న పోలీసుల అభ్యర్థనను గౌరవిస్తూ సమావేశాన్ని ఈ నెల 27కు వాయిదా వేశామన్నారు. ఈ సమావేశం జరగకపోతే అభివృద్ధికి సంబంధించిన నిధులు మురిగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 27న సమావేశం సజావుగా సాగేలా భద్రత కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఏఎస్పీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, షాకీర్, నారాయణస్వామి, అశ్వత్థ ఉన్నారు.

వ్యాపారం పేరుతో ఘరానా మోసం

నల్లచెరువు: వ్యాపారం పేరుతో ఓ వ్యక్తి తమను మోసం చేశాడంటూ పోలీసులకు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలు... ఉమామహేశ్వరరెడ్డిగా పరిచయం చేసుకున్న వ్యక్తి మూడు నెలలుగా నల్లచెరువులోని అద్దె ఇంట్లో ఉంటూ వచ్చాడు. తన భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోందని, జిల్లా వ్యాప్తంగా చక్కెర, సిగరెట్లతో పాటు ఇతర వ్యాపారాలు సాగిస్తున్నానని చెప్పుకున్నాడు. ఈ క్రమంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని వ్యాపారంలో భాగస్వామ్యం కల్పిస్తానని నమ్మబలికాడు. రూ.లక్ష పెట్టుబడి పెడితే రోజుకు రూ.వెయ్యి, రూ.2 లక్షలు పెడితే రూ.2వేలు చొప్పున ఆదాయం వస్తుందన్నాడు. ఆయన మాటలు నమ్మిన యువకులు కొందరు రూ. లక్ష నుంచి రూ.3లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. వీరికి దాదాపు రెండు నెలల పాటూ క్రమం తప్పకుండా డబ్బు చెల్లిస్తూ వచ్చాడు. తనపై నమ్మకం పెంచుకున్న తర్వాత మరింత పెట్టుబడుల రూపంలో అందిన కాడికి నగదు, బంగారు నగలు తీసుకుని బుధవారం రాత్రికి రాత్రి ఉడాయించాడు. మోసపోయిన వారిలో ఎనుములవారిపల్లికి చెందిన ఆదెప్ప (రూ.8.99 లక్షల విలువ చేసే గొర్రెలు), గాజేఖాన్‌పల్లికి చెందిన మస్తాన్ (రూ.4.32లక్షలు), కె.పూలకుంట గ్రామానికి చెందిన వెంకటరమణ (రూ. 12 లక్షలు), కమ్మవారిపల్లికి చెందిన వెంకటరమణ (రూ. 2.60 లక్షలు), రాగన్నగారిపల్లి చెందిన నరేంద్రరెడ్డి (రూ.2.55 లక్షలు), అదే గ్రామానికి చెందిన శంకర్ (రూ.9 లక్షల విలువ చేసే గొర్రెలు) ఉన్నారు. అలాగే మరికొందరు వ్యాపారుల నుంచి బియ్యం బస్తాలు, మొక్క జొన్నలు, వేరుశనగ కాయలు తీసుకెళ్లాడు. అలాగే తన భార్యతో కలసి శుభకార్యానికి వెళుతున్నానంటూ మరో ఇద్దరి నుంచి 13 తులాల బంగారు నగలు తీసుకున్నాడు. మొత్తంగా రూ.2 కోట్ల మేర వసూలు చేసుకుని ఉడాయించినట్లు తెలుస్తోంది. ఘటనపై బాధితులు అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నలుగురికి రిమాండ్

కదిరి టౌన్: గత నెల 28న న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడి చేసిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో పాలినేని శ్రీనివాసులు, రాగిరి జయరాం, కుటాగుళ్ల నాగప్ప, ఫక్కీరప్ప ఉన్నారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న బీజేపీ నేత తలుపుల గంగాధర్‌ను త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు సీఐ పుల్లయ్య తెలిపారు.

మామిడి మొక్కల నరికివేత

కూడేరు: మండలంలోని మరుట్ల–2వ కాలనీ వద్ద గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన కౌసర్ బేగం సాగు చేసిన మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. తనకున్న 1.5 ఎకరాల పొలంలో రెండేళ్ల క్రితం ఆమె 60 మామిడి మొక్కలు నాటి సంరక్షిస్తూ వస్తున్నారు. గురువారం ఉదయం పొలం వద్దకు చేరుకున్న ఆమె 30 మొక్కలను నరికి వేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి : యూటీఎఫ్



వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రుల విశ్వాసం సడలిపోతోందని యూటీఎఫ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కాకముందే చంద్రబాబు సర్కార్ మేల్కోని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓ వసుంధరాదేవిని గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5వ తరగతి వరకూ విద్యార్థులను ఒకే పాఠశాలలో ఉంచాలని, ఒకే సిలబస్... ఒకే పరీక్షా విధానం ఉండాలని, హైస్కూళ్లలో ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఒక కిలోమీటర్, అంతకు పైగా దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ యాజమాన్య పరిధిలోని ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్ 2 స్కూళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు తాహిర్‌వలి, శివశంకర్, లక్ష్మీనారాయణ, నరేష్, మాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి విధులతో రెండు జిల్లాల డీఈఓల చెలగాటం

అనంతపురం ఎడ్యుకేషన్: రెండు జిల్లాల విద్యాశాఖ అధికారుల అశాస్త్రీయ నిర్ణయాలకు రెండు నెలలుగా జీతం అందక ఓ సామాన్య టీచరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ టీచరుగా పని చేస్తున్న ఎం.శివమాధవి... 2022, నవంబరులో ఆ జిల్లా సమగ్రశిక్ష అసిస్టెంట్ జీసీడీఓగా వెళ్లారు. అయితే వ్యక్తిగత కారణాలు పేర్కొంటూ తనను రిలీవ్ చేయాలని ఈ ఏడాది మేలో సమగ్ర శిక్ష ఏపీసీకి విజ్ఞప్తి చేశారు. ఈ ఫైల్‌ను పరిశీలించిన అప్పటి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆమెను రిలీవ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఆ జిల్లా డీఈఓ మీనాక్షి మే 16న (ఎన్నికల కోడ్ అమలులో ఉంది) శివమాధవిని రిలీవ్ చేశారు. దీంతో నిబంధనల మేరకు తనకు పోస్టింగ్ కల్పించాలంటూ పూర్వపు జిల్లా డీఈఓ వరలక్ష్మికి శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ ద్వారా ఫైల్ పెట్టించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రిలీవ్ చేయడం... ఆ సమయానికి జీతం ఎలా చేయాలి? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ ఫైల్‌ను అనంత డీఈఓ వరలక్ష్మి వెనక్కు పంపారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ ఆదేశాల మేరకు ఆ జిల్లా డీఈఓ కార్యాలయంలో శివమాధవి రిపోర్ట్ చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో జూన్ 27న డీఈఓ వరలక్ష్మికి శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి లేఖ రాశారు. శివమాధవి తమ కార్యాలయానికి రోజూ విధులకు హాజరవుతున్నారని, అందుబాటులో ఉన్న ఖాళీల్లో ఆమెకు పోస్టింగ్ కల్పించాలంటూ అందులో పేర్కొన్నారు. కానీ పూర్వపు డీఈఓ వరలక్ష్మి ఆ రోజు నుంచి ఇప్పటి వరకూ శివమాధవికి పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, ఈ అంశంపై వివరణ కోరేందుకు రెండు జిల్లాల డీఈఓలను సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించినా వారి నుంచి స్పందన లేకుండా పోయింది.

దాదులూరులో పట్టపగలే చోరీ

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు... గురువారం సాయంత్రం దాదులూరు సమీపంలోని మిద్దెలు దగ్గర ఉన్న వెంకటాద్రి ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాలో ఉన్న 30 తులాల బంగారు నగలు, రూ.2 లక్షల నగదు అపహరించుకెళ్లారు. చోరీ జరిగిన సమయంలో ఇంటి యజమాని వెంకటాద్రి, ఆయన భార్య వేరే గ్రామానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి కుమారుడు చంద్రబాబు పొలం వద్దకు వెళ్లాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెవెన్యూ అధికారుల తీరుపై సాగుదారుల ఆగ్రహం

గోరంట్ల: దాదాపు ఐదు దశాబ్దాలుగా తమ అనుభవంలో ఉన్న భూములను సాగులో లేని వ్యక్తి పేరుపై ఎలా పాసుపుస్తకాలు మంజూరు చేస్తారంటూ రెవెన్యూ అధికారులపై పలువురు సాగుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. వివరాలు... గోరంట్ల మండలం వానవోలు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 453–3, 479–1,5, 484–2, 510–2, 511–1, 513–2, 539–2, 622–3, 627–1, 627–12డీ, 627–18, 639–1డీ, 640–1డీ, 640–2లలో 11.23 ఎకరాల భూమిపై సాగు హక్కులు కోరుతూ ఓడీసీ మండలం కుసుమవారిపల్లికి చెందిన ఈశ్వరరెడ్డి మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గుంటిపల్లికి రామిరెడ్డి, బయపరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కేశమ్మ, రామలక్ష్మమ్మ, ఆదినారాయణరెడ్డి, నగేష్తో పాటు మరికొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ భూములను ఈశ్వరరెడ్డి పూర్వీకులు తమకు విక్రయించారని ఆధారాలు చూపారు. అయితే క్షేత్రస్థాయిలో ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఆ భూములకు ఈశ్వరరెడ్డి పేరున సాగు హక్కు కల్పిస్తూ ఈ నెల 22న ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఒకానొక దశలో రైతు రామిరెడ్డి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. సమస్య తీవ్రతను గుర్తించిన తహసీల్దార్ అక్బర్‌బాషా ఆందోళన కారులతో మాట్లాడారు. ఈశ్వరరెడ్డి పేరు మీద ఎక్కించిన భూములను ఆన్‌లైన్‌లో రెడ్ మార్కులో ఉంచుతామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

ఏపీఆర్‌ఎస్‌లో స్పెయిన్ కోచ్‌ల శిక్షణ



ఏపీఆర్‌ఎస్ విద్యార్థులతో స్పెయిన్ బాస్కెట్ బాల్ కోచ్‌లు

పరిగి: మెలకువలు పాటిస్తే క్రీడల్లో రాణించవచ్చునని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపల్ ఎన్‌వీ మురళీధర్‌బాబు అన్నారు. గురువారం స్పెయిన్‌కు చెంది బాస్కెట్‌బాల్ కోచ్‌లు ఏపీఆర్‌ఎస్‌ను సందర్శించి, శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. యువతకు ఉపాధి, చేయూత, మహిళాభివృద్ధికి ఆర్థిక సహకారం, విద్య, క్రీడాభివృద్ధికి ఆర్డీటీ చేపట్టిన చర్యలను కొనియాడారు. క్రీడానైపుణ్యాలు వెలికి తీసేందుకు స్పెయిన్ కోచ్‌లు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు క్రీడాదుస్తులు, సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో స్పెయిన్ కోచ్‌లు నటాలియా వెర్డు, రికి ఫోసల్బా, క్రిష్టినా గార్సియా, ఆల్బర్ట్ పెరర్నా, నొసికా మసాచ్, ఎన్రిక్ కామాచో, ఆంటోనియో పుయిగ్‌తో పాటూ బాస్కెట్ బాల్ కో–ఆర్డినేటర్ కిషోర్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహం

అనంతపురం సిటీ: నగర పరిధిలోని హెచ్చెల్సీ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి (42) మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించా లన్నారు.